# మలి సంధ్యలో విరిసిన మల్లెలు

"హలో, ఎట్లా ఉన్నారు?" అని పలకరించాను ఓసారి వెంకట్రామయ్యను మార్నింగ్ వాక్‌లో చాల రోజుల తర్వాత కనిపిపించాక.

"బాగుండ బట్టేగా నీకు కనిపిస్తున్నాను" అని సరసంగా జవాబిచ్చాడు వెంకట్రామయ్య.

నాకు నివ్వెరపోక తప్పలేదు. 'ఇట్లా బదులు పలుకుతాడేం, ఈ మనిషి?' అనుకుంటూ, "ఏం లేదు, ఆ మధ్య మీకు హార్టెటాక్ వచ్చిందని విన్నాను. అందుకని అడిగాను" అన్నాను.

"హార్టెటాక్ వస్తే ఏందంట! ఆధునిక వైద్యం ఇంతగా అభివృద్ధి చెందిన కాలంలో హార్టెటాకంటే సిపుల్ ఫీవర్‌లాంటిది. పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఏదో పెద్ద ప్రమాదం ముంచుకొచ్చినట్లు పలకరించేవాళ్ళంటే నాకు ఒళ్ళు మంట..."

ఆ మనిషిని పలుకరించటమే పొరపాటని నాకు అర్థమయింది. ఒకటి, రెండు సార్లు మాత్రం అతనితో మాట్లాడాను. అప్పుడింత తిక్కగా అతను మాట్లాడిన గుర్తు లేదు.

"పొరపాటయింది లేండి. మీరు మంచి సరసులు. తెలీక అలా జరిగింది. క్షమించెయ్యండి" అన్నాను.

"ఏందది సార్కాజమా?"

"నో, నో! ఐ డోంట్ బిలీవ్ ఇన్ సార్కాజమ్" అన్నాను.

కొంతమంది ఇలాంటి తిక్క మనుషులూ ఉంటారు. బంగార్రాజు అలాంటి వాడే. "మీ ఇంటి పక్కనే పోస్టాఫీసు కదా! ఇంటికెళ్ళేటప్పుడు ఈ ఉత్తరం పోస్టుచెయ్యి" అని

చూడండి, అతని తత్వం మీకు తెలుస్తుంది.

"అట్లాంటి పనులు నాకు చెప్పకు. రేప్పొద్దున ఆ ఉత్తరం చేరకపోతే, నేనా ఉత్తరం పోస్టుచేశానా లేదా అని నీకనుమానం రావచ్చు. నీ మాట ఒబ్లయిజు చెయ్యబట్టే కదా నేను నీ దృష్టిలో నమ్మతగ్గ వ్యక్తి కాకపోయింది? నాకెందు కొచ్చిన తంటా? వస్తా" అని వెళ్ళిపోతాడతను.

అందుకే వెంకట్రామయ్య పార్క్‌లో కన్పించినా, పట్టించుకోనట్లు వెళ్ళిపోసాగాను. పార్కు పరిచయాలు మావి. జనాలకు ఆరోగ్యం పట్ల ఆసక్తి మొదలయింది. ఆధునిక వైద్యం, ప్రాణాయామం, యోగం పట్ల కొత్తగా మేల్కొన్న జాగృతి మా లాంటి రిటైరయినవ్యక్తుల నిలా 'మార్నింగ్ వాక్'లాంటి కనీస శారీరక వ్యాయామానికి పురికొల్పింది. అందులో భాగంగానే నా లాంటి చాల మందిపార్కుకు వెచ్చేవాళ్ళు. ఉబుసు పోకకు పరిచయాలు పెంచుకునేవారు. కనీసం కొంతమంది విషయంలోనయినా ఆ కొత్త పరిచయాలు మిగతా సమయాల్లో కలుసుకోటానికీ, స్నేహసంబంధాలు మరింత గాఢమవటానికీ దారితీశాయి. ఆ మధ్య ఇంగ్లాండు వెళ్ళి కొడుకు దగ్గర ఆర్నెల్లు ఉండి తిరిగి వచ్చాను. జనాలకు నేను గుర్తున్నానో లేదో నని నా మానాన నేను తిరుగుతున్నాను.

"హలో, జగన్నాథం! ఏమిటి, పరిచయం లేనట్టు అలా తప్పించుకు పోతున్నావ్? నాతో మాట్లాడటం ఇష్టం లేదా యేం?" అని వెంకట్రామయ్య తనే పలకరించాడు. అతనిప్పుడు పలకరించాక నాకు తప్పలేదు. అతనూ, సుదర్శనం కలసి తిరుగుతున్నారు.

"ఎంతమాటన్నారు, మీకు ఇబ్బంది కలిగించట మెందుకని పలకరించ లేదు. అంతేగానీ మాట్లాడటం ఇష్టం లేక కాదు" అని సమాధానమిచ్చాను తప్పుకోలేక.

"నాకెందు కిష్టం ఉండదు. నీకు ఇష్టం లేక పోతే అది నా తలకు చుట్టకు, బాగుండదు" అన్నాడు వెంకట్రామయ్య.

నాది సర్దుకుపోయే తత్త్వం. అందుకే, "నేనే పొరపాటు పడి ఉంటాను లేండి" అన్నాను.

"అలా అన్నావు, బావుంది. నేను ఆర్నెల్ల క్రితం అన్న మాటలవల్ల నీ కేమన్నా కష్టం కలిగిందేమో! ఇంగ్లాండు వెళ్ళావుట కదా?"

కొంతమందికి సమాజంలో స్టేటస్ కావాలి. తామెట్టాగో జీవితంలో గొప్పగా సాధించ

లేక పోయారు. కొడుకులు ఏ అమెరికాలోనో, ఇంగ్లాడులోనే ఉంటే తమకేదో గొప్ప స్టేటస్ కలిగినటట్లు భావిస్తారు. అలాంటి రామచంద్రయ్య అప్పుడు నాకు గుర్తుకు వచ్చాడు.

అతడికి ఎందుకో మరి కొంత అహంకారం, ఇతర్ల పట్ల తృణీకారం. తననుగూర్చి అతిగా చెప్పుకునే జనంలో ఒకడితను. వయసు మనసుకు పరిపక్వత నిస్తుందంటారు కానీ అది అబద్ధం! మరింతమూర్ఖత్వాన్ని కూడా సంతరించి పెట్టవచ్చు. రామచంద్రయ్య ప్రభుత్వంలో విజిలెన్స్ ఆఫీసరుగా పదవీ విరమణ చేశానని చెప్పుకునేవాడు. అయితే ఆ తర్వాత తెల్సింది నాకు- అతను ఇప్పుడు మూసేసిన ఓ పియస్‌యులో సెక్యూరిటీ అధికారిగా పనిచేసి వీఆరెస్ పుచ్చుకుని రిటైరయ్యాడని.

పేరడిగితే చెప్పి, నేను మరి మాట్లాడకుండా వెళ్ళబోతూంటే, "ఏ ఉద్యోగం చేసేవాళ్ళం?" అని సంబోధన లేకుండానే ప్రశ్నించాడు రామచంద్రయ్య.

"ఓ కాలేజీలో పనిచేశాను" అని చెప్పాను.

"క్లార్కా?"

"లెక్చరర్‌గా పనిచేశానులెండి."

"కనీసం ప్రిన్సిపాలుగా కూడ చెయ్యలేదా?"

దానికి నేనేం సమాధానం చెప్పలేదు. ఆ రోజుల్లో ఏ ఉద్యోగాలు చేసినా ఇప్పుడు వాటికి ప్రాధాన్యత లేదన్నది నా అభిప్రాయం. తను ప్రభుత్వంలో విజిలెన్స్ ఆఫీసరుగా పనిచేసి పదవీ విరమణ చేశానని చెప్పాడు. "నాకు బొల్లారంలో ఓ ఇల్లుంది. అది దూరమని చెప్పి ఇక్కడికి రెండు వీధుల అవతల ముప్ఫయి లక్షలు పెట్టి ఓ ఫ్లాటు తీసుకున్నాను. కొడుకు అమెరికాలోపనిచేస్తున్నాడు. కూతురి పెళ్ళిచేసేశాను. మేమిద్దరమే కొంపలో ఉండేది" అంటూ సంక్షిప్తంగా తన కుటుంబ చరిత్ర పూర్తి చేశాడు. ఆపైన, "మీ కెంత మంది పిల్లలు?" అని అడిగాడు.

చెప్పాను.

"ఏం చేస్తున్నారు?"

చెప్పాను. అప్పటికింకా నా కొడుకు ఇంగ్లాండు వెళ్ళలేదు. రామచంద్రయ్య భూలోక స్వర్గం అమెరికాగానీ, ఇంగ్లాండు కాదు.

"అమెరికాలో ఒక్కడూ లేడా?" అని ఆ చిన్న ముఖాముఖీలో నేను నిరర్థకుడినని తేల్చిపానేసి, చక్కాపోయాడు. ఆ తర్వాత అతను నాతో మాట్లాడింది లేదు. ఆ తర్వాతెప్పుడో

అతను బ్రెయిను హమరేజితో పోయాడని ఎవరో చెప్పారు. 'జాతస్య మరణం ధృవం.' కానీ, నాకొక్కటే విచారం, అతను భూతల స్వర్గమైన అమెరికాలో పోలేకపోయాడని.

ఇప్పుడు వెంకట్రామయ్య పలకరించే సరికి, అతడూ రామచంద్రయ్య బాపతేనా అని నాకన్పించింది.

"చూడు, మనుషుల మధ్య స్నేహం పెరగాలంటే చిన్న చిన్న తప్పుల్ని పట్టించుకో కూడదని నంజుండప్ప అన్నాడు" అన్నాడు వెంకట్రామయ్య.

"అతనెవరు?" అనడిగాను.

"మన వెంకట్రామయ్య స్నేహితుడు!" అని కిసుక్కున నవ్వాడు సుదర్శనం.

అంతలో పార్క్ పిట్ట గోడమీద నుండి పిల్చారెవరో, "చాయ్ తాగుదాం రండి" అంటూ.

"బంగ్లా బాబు లాగా ఉంది. పదండి వెళ్దాం" అన్నాడు వెంకట్రామయ్య.

"మీరు వెళ్ళండి. అతనెవరో నాకు తెలియదు."

"చాయ్ తాగటానికి మనిషి తెలియాలా? పద, పద" అంటూ నన్ను లాక్కెళ్ళాడు వెంకట్రామయ్య.

"అదేం పేరు? బెంగాలీనా?"

"పదహారణాల తెలుగువాడు. ఇప్పుడు ధోవతి కట్టుకోవటం మనకు బెంగాలీవాళ్లలోనే కనిపిస్తుంది. వాళ్ళూ చెడిపోతున్నారనుకో. తేడా అల్లా మనం పూర్తిగా చెడిపోయాం. అతను మన పూర్వ సంప్రదాయాన్ని నిలబెడుతూ, బెంగాలీ వాళ్ళలా పూర్తిగా చెడిపోకుండా కాపాడుతున్నారు కనుక మేం అతన్ని 'బంగ్లా బాబు' అని పిలుస్తాం. అర్థం కాలేదా? 'అదంతే' అని సమాధాన పడిపో. ఎన్నింటికి మనం జీవితంలో రాజీ పడి పోవటంలేదు! చాల రోజులయింది కనిపించి ఎక్కడకెళ్ళాడో ఏమోమరి!"

అందరం బయటకొచ్చాం.

"ఏమయ్యావు హటాత్తుగా మాయమయ్యావు? పోయావేమోననుకున్నా" అన్నాడు వెంకట్రామయ్య.

ఆ మాటకు బంగ్లా బాబు పగలబడి నవ్వాడు. "పాపీ చిరయువని ఎంతమందిని చంపితే పోతాం గనుక. ఇప్పుడు చెన్నైలో కూతురి దగ్గరుంటున్నాను.అంతా మామూలే, మార్పేం లేదు. ఇక్కడుంటే నువ్వు కన్పించేవాడివి- నీతో మాట్లాడిన తీరే వేరు- అది

తప్ప అంతా మామూలుగానే నడుస్తున్నది. పూజకు బ్రహ్మాండంగా పూలుదొరుకుతాయి, తాంబూల చర్వణానికి ఆకులు, భగవద్భక్తులకు కోవెలలు పుష్కలం. మాట్లాడటానికి తెలుగువాడు మాత్రం కరువు. అవును, రామచంద్రయ్య ఎట్లా ఉన్నాడు? వాడికి నామనవణ్ణి అమెరికా పంపిస్తున్నానని చెప్పాలి. నువ్వేం మాట్లాడకు, వెంకట్రామయ్యా! అక్కడ తెలుగు మాట్లాడక నోరు చవి చచ్చిందనుకో.చివరకు మా మనవడు కూడా తమిళమే! నా కిక్కడ మౌలాలిలో ఇల్లుంది కదా! అది వాడి పేరున ట్రాన్స్ఫరు చేస్తే వాడికిక్కడ బాంకులో అమెరికా వెళ్ళటానికి లోనిస్తారట! ఆ విషయంలో వచ్చాను. చెన్నయ్‌కి దగ్గరే కదా పాండిచ్చేరి. రెండు మూడు సార్లు వెళ్ళాను. సముద్రపొడ్డునే రోడ్డు. కింద రాళ్ళకు నీళ్ళుకొట్టుకుంటూంటే అక్కడే కూర్చునుండి పోవాలనిపిస్తుంది. అరవిందాశ్రమానికి కూడా వెళ్ళాను. అరవిందయోగి రాసిన 'సావిత్రి' కొనుక్కు వచ్చాను. చదవటానికి ప్రయత్నం చేస్తున్నాను కానీ అర్థమవటం లేదు. ఈ కాటరాక్టొకటి! ఇబ్బంది పెడుతోంది.ఆపరేషను చేయించుకోవాలి. మన చావు మనం చావాలి గానీ మన కెవరు ఆసరా! ముసలాడికి కళ్ళు సరిగా కన్పించకపోతే మాత్రమేం. హాయిగా 'కృష్ణా రామా' అనుకోవచ్చుగా అనుకుంటారు..."

"ఇంక ఒక్కమాట మాట్లాడినా చంపేస్తాను. మేమూ మనుషులమే. మాకూ నోళ్ళున్నాయి, తీట వదుల్చుకోటానికి! పాపం, రామచంద్రయ్య పోయాడు. బ్రెయిన్ హెమరేజ్! పోయినప్పుడు నేను పక్కనే ఉన్నాను. మన స్పృహలో లేదు.పూర్‌మాన్! ఇప్పుడక్కడ ఆ పైవాడి దగ్గర కోస్తూ ఉంటాడు. నాకు చెప్పినట్టే వాడికీ చెప్పి ఉండవచ్చు- జీవితంలో ఒకసారయినా అమెరికా దర్శించక పోవటం దౌర్భాగ్యమయ్యా! అని. నౌ మీట్ మై ఫ్రండ్స్, నీకు సుదర్శనం తెలిసిన వాడేగా" అంటూ నన్ను పరిచయం చేశాడు వెంకట్రామయ్య. "ఇతడున్నాడే, జగన్నాథం! మహామొహమాటస్థుడు. అప్రియమయింది సత్యమయినా చెప్ప జంకుతాడు. మనిషి స్నేహశీలి. ఇతన్ని నమ్మిచెడిపోయేవాళ్ళుండరు. కానీ, తనంత తానుగ స్నేహహస్తం చాచుతూ ముందుకు రాడు" అని చెప్తూ ముక్తాయింపుగా, "పిరికి మనిషి!" అన్నాడు.

"నువ్వు మంచి ధైర్యస్థుడివా?" అడిగాడు బెంగాలీ బాబు.

"నేనెవరితోనూ ఆమాటనలేదే? నీ కెందుకా తప్పుడు అభిప్రాయమొచ్చింది! సాధారణమయిన ప్రతిమనిషీ భయస్థుడే. భయమే నాగరికతకు పునాది. 'ఫియర్ రెలిజియన్' అన్నాడు ఐన్‌స్టీన్..."

"ఈ ఐన్‌స్టీన్ కూడ నంజుడప్ప లాంటి మనిషేనా?" అడిగాడు సుదర్శనం.

"ఇదేనయ్యా మీతో తంటా. ఏది జోకో, ఏది నిజమో తెలుసుకోలేరు! అవసరం, కోరిక- అ రెండూ మానవుడు కృషి చేపట్టటానికీ, ఫలితమయిన ఉత్పాదకతకూ కారణమన్నాడు ఐన్స్టీన్. అనాది కాలంలో భయం- ఆకలి భయం, క్రూరజంతువుల నుండి భయం, రోగం-రొష్టు-మృత్యు భయం- మతపర ఆలోచనలకు దారితీసిందంటాడు ఆయన. ఆ ఉనికి స్థాయిలో హేతు సంబంధాల అవగాహన పరిమితమయింది కనుక, తను భయపడే వైపరీత్యాలకు కారణమనుకున్న తనలాంటి రూపమే ఉన్న ఓ మూర్తిని సృజించుకుని, యజ్ఞయాగాదులతో ఆ మూర్తిని తృప్తి పరచాలని, ఆ శక్తి కృప పొందాలనీ ప్రయత్నించాడు అనాది మానవుడు. "ఐ కాల్ దిస్ రెలీజియస్ ఆఫ్ ఫియర్" అన్నాడు ఐన్స్టీన్. దానిమీద ఆధారపడే ఎంతో సూక్ష్మాతి సూక్ష్మ మేథోమథనం ప్రారంభమయింది ఆ తర్వాత. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే -అర్థం లేని ధైర్యం నిరర్థకం. జాగ్రత్త పడే పిరికితనం గర్హనీయమయింది కాదు...."

బెంగాలీబాబుకు ఇతరులు మాట్లాడుతుంటే నోరు మూసుకు కూర్చోవటం ఇష్టంలేదు.

"ఆపు, నీ గోల! నీ గోల భరించలేకే చెన్నయ్ పారిపోయాను" అన్నాడతను.

"నీ వాగుడు భరించినందువల్లే నాకు హార్ట్ ఎటాక్ వచ్చిందని మన పార్క్‌లో బుర్ర ఉన్నవాళ్ళందరూ చెప్పుకున్నారు" అన్నాడు వెంకట్రామయ్య.

"నిజమా? నాకు అలాంటివాళ్ళెవరూ ఇక్కడ కన్పించటం లేదే" అని పకపకా నవ్వాడు బెంగాలీ బాబు. ఆపైన, "సారీ, సుదర్శనం, జగన్నాథంగారూ, మిమ్మల్ని గురించి కాదు" అన్నాడు.

ఆ మర్నాడు వెంకట్రామయ్య అన్నాడు, "కొంతమంది బంగ్లా బాబు లాంటి వాళ్ళు తామే మాట్లాడుతుంటారు. నోరు తెరిస్తే వాళ్ళ నాపటం కష్టం. రామ్మూర్తి బంగ్లా బాబులా మనల్ని చావ నూకడు కానీ, తను పొద్దున లేచినప్పటి నుండి రాత్రి పడుకోబోయేదాకా జరిగిన విషయాల గురించి విసుగు కలిగించకుండా చెప్పగలడు."

"మన రామనాథం మాటల్లో చెప్పాలంటే, 'అతని మాటలు మంద్రంగా, తంబురలా నేపథ్యంలో విన్పిస్తూ, మనల్ని డిస్టర్బ్ చెయ్యవు' " అన్నాను.

"అవును. హి డ్రోన్స్ ఆన్ ఫరవర్స్' అన్నాడువెంకట్రామయ్య.

"అంటే?"

"అంటే- హి టాక్స్ ఫరవర్స్ ఇనె బోరింగ్ మానర్!" అని వ్యాఖ్యానించాడు కుశాల్రావు.

"యువార్ వెరీ క్రూడ్! ఇదే మాటని రామనాథం ఎంత పాలిష్డ్‌గా చెప్పాడో చూడు"

అన్నాడు సుదర్శనం.

"నీకు ఇంగ్లీషు తెలిసి యాడవదు. నువ్వు మాట్లాడకు" అన్నాడు వెంకట్రామయ్య.

"రామనాథం చెప్పిందీ, వెంకట్రామయ్య చెప్పిందీ-రెండూ బాగానేవున్నాయి" అన్నాను.

"అంటే నాది కువ్యాఖ్యానమంటావా? అసలు విషయానికి రంగులు పుయ్యటం నాకు చేత కాదు" అన్నాడు కుశాగ్రావు కోపంగా.

"లేదు, లేదు, జగన్నాథం కవి హృదయం అర్థం చేసుకోండి. మీరు చెప్పింది సరికాదని జగన్నాథం అభిప్రాయం కాదు. అలా అని మనం రామ్మూర్తిని ఇన్సల్టు చెయ్యటంలేదు. చేస్తున్నామా? ప్రతి మనిషితోనూ లోపాలుంటయ్యని ఇంద్రాణీ చటర్జీ చెప్పింది. వాళ్ళూ వీళ్ళెందుకు? నాలో లోపమేమిటంటే అందరినీ చులకనగా చూస్తున్నానని మీరు భావించేటల్లు నేను మాట్లాడటం.... అఫ్‌కోర్స్, స్కాలర్స్ అందరిలోనూ ఉండే దుర్లక్షణమే ఇది!" అన్నాడు వెంకట్రామయ్య.

"ఆ ఇంద్రాణీ చటర్జీ ఎవరు?"

"పేరు బావుండ్లా?" నవ్వాడు వెంకట్రామయ్య.

అలా జోకులేసుకుంటుంటే మాకు పొద్దే తెలిసేది కాదు.

క్రమక్రమంగా వెంకట్రామయ్య మిత్రబృందమంతా నాకు సన్నిహితమయ్యారు. ఒక్కోసారి తిక్కగా మాట్లాడినా, వెంకట్రామయ్యతో మాట్లాడుతుంటే స్నేహపు వెచ్చటి దుప్పటి కప్పుకున్నట్లుండేది.

ఆ రోజు మార్నింగ్‌వాక్‌కి ఇంకా సుదర్శనం రాలేదు. నేనూ, వెంకట్రామయ్యా నడుస్తున్నాం. నాలుగు రౌండ్లు కొట్టాక, "ఇప్పటికే చాల తిరిగేసినట్టున్నాం. ఇలా అధికంగా తిరిగితే, హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదముందని ప్రఖ్యాత సైంటిష్టు వెంకట్రామయ్య చెప్పాడు" అన్నాడు వెంకట్రామయ్య.

"ఆ పేరు నేను వినలేదండీ!" అన్నాను.

"ఆ మాత్రం తెలియదా? ఏం మనిషివయ్యా? ఇలాంటి అజ్ఞానులవల్లే ప్రపంచం ఇలా తగలడుతోంది."

అతని తత్వం తెలిసింది కనుక, నేను అతని మాటలకు బాధ పడలేదు. ఆ వెంకట్రామయ్య ఎవరో తెలియకపోలేదు.

అయినా, అమాయకంగా ముఖం పెట్టి "ఇంతకీ ఆయనెవరండీ?" అని ప్రశ్నించాను.

"ఇదే నీతో చిక్కు! నేను గహన తాత్త్విక విషయాన్ని గురించి ప్రసంగించబోతుంటే నువ్వు మధ్యలో చొప్పదంటు ప్రశ్నలేస్తావు" అని అతను పగలబడి నవ్వేశాడు.

మార్నింగ్ వాక్‌కి క్రమంగా వచ్చే సుదర్శనం మా వెనుకనే తిరుగుతున్నాడు. వెంకట్రామయ్య, అతను మంచి స్నేహితులు. ఆలస్యంగా వచ్చి వెంకట్రామయ్యను కలుసుకోవాలని వడివడిగా అడుగు లేస్తూ మా వెనక్కు వచ్చి చేరాడు. వెంకట్రామయ్య, నేను అతన్ని గమనించలేదు.

అతనికి సందేహమొచ్చింది, ఈ 'చొప్పదంటు ప్రశ్నలే'మిటా? అని. అనుమానం కలిగిందంటే ఆపుకోలేడు. అది తీర్చుకుంటేనే అతనికి మనశ్శాంతి. మీరు మరేమన్నా వితండవాదం చేస్తే, "కక్కొస్తే ఆపుకోగలమా?"అంటాడు.

అందుకే, "చొప్పదంటు ప్రశ్నలేమిటయ్యా, వెంకట్రామయ్యా?" అని కక్కేశాడు.

"ఓర్నీయవ్వ, నువ్వొ తగలడ్డావూ? ఇంక నా ప్రసంగం సాగినట్టే! ఇప్పుడు నువ్వడిగిందే చొప్పదంటు ప్రశ్న! అర్థమయిందా?" అన్నాడు వెంకట్రామయ్య, వెనక్కు తిరుగుతూ.

సుదర్శనం నాలా మొహమాటం పడే మనిషి కాదు. అతనికి వాళ్ళ నాయన చిన్నప్పుడే చెప్పాడు, "మనిషి గొప్పవాడవాలంటే, 'కాదు', 'లేదు' అనటం నేర్చుకోవాల"ని. అలా అని అతనే మిత్రబృందానికి చెప్పాడు. మొహమాటానికి పోయి ఆపదను కొని తెచ్చుకోకూడదని ఆయన అభిప్రాయం. ఆ అభిప్రాయం లోని అంతరార్థమయితే అతని కర్థంకాలేదు కానీ, 'కాదు', 'లేద'నటం మాత్రం బాగా నేర్చుకున్నాడు.

కనుకనే, "కాలేదు" అని నిర్మొహమాటంగా చెప్పాడు.

"వెళ్ళి మళ్ళీ స్కూల్లో చేరు, మాష్టరు బెత్తంతో రెండు తగిలించి చొప్పదంటు ప్రశ్నలేమిటో చెప్తాడు" అన్నాడు వెంకట్రామయ్య, కోపంగా.

"ఓహో, నీకూ తెలియదన్నమాట ఆ మాటకర్థం! చూడూ, అర్థం తెలియకుండా మాటల్ని వాడకూడదు. అది అనిష్ఠం. మాటలు బ్రహ్మ ముఖాన్నుండి వెలువడ్డాయంట! తప్పుగా వాడితే నెత్తి అణుస్తాయంట!"

"అలా అని ఎవరు చెప్పారు, మీ బామ్మ చెప్పిందా?"

అయితే సుదర్శనం జవాబు చెప్పే లోపలే, నేను అన్నాను మొహమాట పడిపోతూ, "అనిష్ఠం కాదేమో నండీ, అరిష్టమనాలనుకుంటా" అని.

"కాదు, అనిష్ఠమే, ఏమంటావు వెంకట్రామయ్యా?" అనడిగాడు సుదర్శనం.

"వత్తుంటే ఏంది, లేకుంటే ఏంది? ఏదో ఒకటిలే, ఇప్పుడా చర్చ ఏందుకూ?"

"ఇష్టం. దానికి వ్యతిరేకం అయిష్టం లేక అనిష్టం. అయితే 'కీడు' అని చెప్పటానికి 'అరిష్ట' మంటారండీ. కనుక, అనిష్ఠమవటానికి వీల్లేదండీ" అన్నాను తెగించి.

"ఇందులో ఏదో పాయింటు ఉన్నట్టుంది. వత్తులు వదిలెయ్, బాగు పడి పోతావ్. అరవ్వాళ్ళు తమ రాష్ట్రంలో అంత ప్రగతి సాధించగలిగారంటే అందుకు కారణం వత్తులు వదిలెయ్యటమే! వత్తులు మన సంస్కృత దాస్యానికిచిహ్న మన్నాడు సౌందరరాజన్" అన్నాడు వెంకట్రామయ్య.

"ఆయనెవరండీ."

"ఎవడో, కోన్కిస్కా గొట్టంగాడు! ఇప్పుడతని సంగతి తెల్సుకోటం అంత అవసరమా?"

"తెలిసింది, తెలిసింది" అంటూ ఒక్క ఎగురు ఎగిరాడు సుదర్శనం.

"ఏవిటా పిచ్చి గంతులు! గుండె ఆగి పోగలదు. అయినా, నీ కే విషయం తెలిసే అవకాశాల్లేవే! మతి గానీ తప్పిందా యేం?"

"నీ పిచ్చి వాగుడు కాస్త సేపు ఆపి నేను చెప్పేది విను. అనిష్ఠమనేది వేరే పదం. ఇష్టానికీ, అరిష్టానికీదానికీ ఏం సంబంధం లేదు. ఇది నిష్ఠమన్న పదం నుండి పుట్టింది. దాని ఆపోజిట్ అనిష్ఠం. నిష్ఠం అంటే నాకు అర్థం తెలియదు కానీ, అనిష్ఠం అంటే 'కీడు' కనుక నిష్ఠం అంటే 'మంచి', 'మేలు' అయి ఉంటుంది."

"అవునోయ్! నీ బుర్ర కూడా అప్పుడప్పుడు పని చేస్తూనే ఉంటుంది. నా వోటు కూడా అనిష్ఠానికే."

"మాటల అర్థాలు వోట్ల సంఖ్య మీద ఆధారపడవండీ! వాటికో వ్యుత్పత్తి ఉంటుంది, ఓ...."

వెంకట్రామయ్య నన్ను మాట్లాడనివ్వ లేదు.

"తెలియని విషయాలు తెల్సుకోవాలి. అదిష్టం లేకపోతే నోరు మూసుకోవాలి. అంతేగానీ విషయం నిర్ధారిత మయ్యాక కూడ వితండ వాదం చెయ్య కూడదు" అన్నాడు.

"ఆఁ, మరే! ప్రజాస్వామ్యంలో ఏ విషయమయినా మరెలా నిర్ధారితమవుతుంది? వోట్ల ఆధిక్యాన్ని బట్టేకదా! ఓ మాట చెప్పవయ్యా, జగన్నాథం! పియుటి పుట్ అయితే, బియుటి బట్ ఎలా అయింది?..."

"పుట్‌లు, బట్‌ల గురించి ఎప్పుడో చెప్పారు అంత కంటే కొత్తవేం చెప్పలేవా?" అన్నాడు వెంకట్రామయ్య.

"తెలిస్తే చెప్పొచ్చుగా?"

"ఎవరో చెప్పగా విన్నాను. ough అన్న అక్షరాలను ఉపయోగించి 36 మాటలున్నాయి కానీ వాటిని 9 విధాలుగా ఉపయోగిస్తారట! ఈ వాక్యం చూడండి: "Though a rough cough and hiccoughs ploughed through him, he houghed the horse with thorough thoughtfulness" అన్నాను.

"మరి నువ్వు చెప్పు, ఎందుకలా ఉన్నాయో? చెప్ప లేవు. ఎందువల్లా? జనాలు అలా పలుకుతున్నారు, కనుక మనమూ అలా పలకాలి. తెలిసిన వాళ్ళు- అంటే నా బోటి వాళ్ళు- చెప్తుంటే తెలుసుకోవాలి గానీ కుతర్కం చెయ్యకూడదు. 'నువ్వు చెప్తుంటే విషయం అరటి పండు వలచినా తొక్కలా ఎంత మధురంగా ఉంటుందిరా?' అనేది మా బామ్మ" అన్నాడు సాధికారికంగా సుదర్శనం.

"తొక్క వలచిన పండులా నేమో నండీ...!" అని నసిగాను.

"ఏదో లేవయ్యా! అసలు పండు వదిలేసి తొక్కే తినాలంట! అందులో ఎన్నో విటమిన్లు ఉన్నాయంట! పండ్లు మనం తిని, తొక్కలను పశువులకు వేస్తున్నాం. అందువల్లే అవి బలుస్తున్నాయి, మనం కునారిల్లిపోతున్నాం. 'తొక్కలు తిను, పండు వదిలెయ్' అన్న ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఎంతయినా ఉంది" అన్నాడు వెంకట్రామయ్య.

"ఛీ! తొక్క తిని పండు వదిలెయ్యాలా? 'అలాంటి అప్రాచ్యపు పనులు చేయొద్దు రా' అని మా బామ్మ అంటుంటే ఎలాంటివో అనుకున్నాను. ఇప్పుడు అర్థమయింది, అప్రాచ్యపు పనులంటే ఏమిటో! తొక్క తిని పండు వదిలెయ్యటమంటే అదే!"

"మా తాతా చెప్పాడు..."

"ఏమని?"

"నీ భావాలనర్థ చేసుకోటం అందరివల్లా సాధ్యం కాదురా! 'సో, డోన్ట్ త్రో పెరల్స్ బిఫోర ఎ స్వైన్' అని."

"అంటే నేను పందినా?"

"నేను ఆ మాట అనలేదు."

"నువ్వు చెప్పవయ్యా, జగన్నాథం! వాడా తప్పుడు కూత కూశాడా లేదా?"

"ఏమో సార్! మీ ఇద్దరి మధ్య జోక్యం చేసుకోటం నాకు అరిష్టం అని పిస్తోంది."

"అరిష్టం కాదు, అనిష్ఠమనాలి? ఒకసారి చెబితే గుర్తుంచుకోవాలి. తెలిసి తప్పులు చెయ్య కూడదు" అన్నాడు సుదర్శనం.

"తెలవక తప్పులు చెయ్యొచ్చా? తెలిసీ చెయ్యకూడదు, తెలవకా చెయ్యకూడదు. అది నా సిద్ధాంతం" అన్నాడు వెంకట్రామయ్య.

"మీ మాట నిజమే లేండి. అయితే 'అనిష్ఠం'లో 'ట' వత్తు మహా ప్రాణం కాదు, అల్పప్రాణమని ఇంకా ఎందుకో నా కనిపిస్తోంది. ఒకసారి తెలిసిన వారి నడిగితే అనుమానరాహిత్య మవుతుంది" అన్నాను, జంకుతూనే.

నేను మహా ప్రాణం, అల్పప్రాణం లాంటి పెద్ద పదాలు వాడాక, అవేమిటో తెలియని వెంకట్రామయ్యకు, నేను సరుకున్న మనిషిలా కన్పించాను.

"రైట్. నువ్వే కరెక్ట్! మళ్ళీ ఆలోచించాక నీ మాటే కరెక్ట్ అనిపిస్తోంది" అన్నాడు.

"నువ్వు అనవసరంగా కల్పించుకోకు, వెంకట్రామయ్యా! కరెక్ట్ అని చెప్పటానికి నీకున్న క్వాలిఫికేషనేమిటి? తెలుగులో పండిన తల నాది. తెలుగు విషయం నీకు తెలీదు కనుక గమ్మునూర్కో"

"నాకు తెలుగు తెలీదా? నేను గమ్మునూర్కోవాలా? తెలుగులో పుట్టి పెరిగిన వాణ్ణి! మా నాయన తెలుగు పండితుడు. మా తాత కవి. ఆయన పద్యాలు- నువ్వు వినలేదు కానీ, రస గుళికలనుకో. అలాంటి వంశంలో పుట్టిన నాకు తెలుగు రాదంటావా, నీ నోరు పడ!" అని తిట్టాడు వెంకట్రామయ్య.

"తెలీకేం, పండిత పుత్రుడివి. నీతో నేను సాటా?"

"అదీ, అట్లా దారికి రా, నాతో పెట్టుకోకు."

"అంత గర్వంతో ఉప్పొంగి పోకు. పండిత పుత్రుడంటే 'శుంఠ' అని అర్థం."

"ఏం, జగన్నాథం! అతగాడనే మాట నిజమేనా? పండిత పుత్రుడు శుంఠెలా అవుతాడు, పండితుడే అవుతాడు, నా లాగా!"

నిజం కాదనలేకా, అబద్ధం చెప్పలేకా సతమతమయ్యా. మొహమాటంతో ఇబ్బంది!

"ఆయన తను తెలుగులో పండిన తల అంటున్నారుగా? ఆయన మాటే కరెక్టేమో?" అన్నాడు బడితె విరక్కుండా పాము చావకుండా.

"పండిన తలా? చీకేసిన తాడిపండు!" అని తను వేసిన రూపకానికి తనే ఆనందిస్తూ

నవ్వాడు వెంకట్రామయ్య.

"ఛూ, నీతో మాట్లాడటమంత బుద్ధితక్కువ పని మరొకటి లేదు. దేనిమీదో రాయేస్తే మొహాన చిందుతుందంట!" అని నడక ఆపేసి, వెళ్ళి ఓ సిమెంటు బెంచి మీద కూర్చున్నాడు సుదర్శనం, అలిగి.

నిర్ఘాంతపోయి చూస్తున్న నాతో, "అతగాడిలో సెన్సాఫ్ హ్యూమర్ ఏ మాత్రం లేదు. అతడిని పట్టించుకోకు" అన్నాడు వెంకట్రామయ్య.

ఆ రోజు నేను పార్క్‌కు వాకింగ్‌కి వచ్చేటప్పటికి ఆలస్యమయింది. అప్పటికి వెంకట్రామయ్య, సుదర్శనం వాకింగ్ పూర్తి చేసి, సిమెంట్ బెంచీ మీద కూర్చుని నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. నేను ఆశ్చర్య పోయాను. నిన్నటి తీరు చూశాక సుదర్శనం మళ్ళా వెంకట్రామయ్యతో మాట్లాడతాడనుకో లేదు. జనాలకు ఒకళ్ళను గురించి మరొకళ్ళకు తెలియకపోవటంవల్లే వాళ్ళంత మిత్రులవటానికి కారణమన్నది జీవితం లోని వ్యంగ్యమని మనలో చాలమందికి తెలీదు.

"రావోయ్, రా!" అని ఆహ్వానించాడు వెంకట్రామయ్య నన్ను చూసి.

"ఇప్పుడేకదా వచ్చింది, నాలుగైదు రౌండ్లు కొట్టి వస్తాను" అన్నాను.

"రోజూ కొట్టే రౌండ్లేలే! కబుర్లూ అవసరమే. మానసికారోగ్యాన్ని కాపాడుతాయని వింబుల్డెన్ చెప్పాడు. ఆయనెవరని అడక్కు. నేను చెప్పను" అన్నాడు వెంకట్రామయ్య.

"అంటే అతడెవరో తనకూ తెలీదని అర్థం!" అని వ్యాఖ్యానించాడు సుదర్శనం.

"తెలీకపోతే ఏందంట? ఎక్కడో, ఎప్పుడో, ఎవడో చెప్పి ఉండొచ్చుకదా?" అని నన్ను లాగి తన పక్కన కూర్చో పెట్టుకున్నాడు వెంకట్రామయ్య.

నాకు ఎక్కడో చదివిన జోకు గుర్తుకు వచ్చింది. ఒక సైనికుడన్నాట్ట: 'సర్!మన్ని శత్రువులు అన్ని వైపుల నుండి చుట్టుముట్టారు' అని. అందుకు మేజరు బదులిచ్చాడట: 'అంతకంటే కావల్సిందేముంది. మనం ఏ వైపు నుండయినా దాడి ప్రారంభించవచ్చు' అని. అలాంటి మనిషి వెంకట్రామయ్య.

"వాడెవడో తెలుగువాడు మాత్రం కాదు. అది మాత్రం నిశ్చితం!" అన్నాడు సుదర్శనం.

"అది నీకెలా తెల్సు?"

"నువ్వు తెలుగు పుస్తకాలు చదివిన దాఖలాలు లేవు. కనుక నువ్వు నేర్చుకున్న

దేదో విదేశీయమే కానీ, స్వదేశీయం అవటానికి వీలులేదు."

"అందుకే 'మనవాళ్ళు వట్టి వెధవాయలోయ్' అన్నాడు గిరీశం. గిరీశం ఎవరు అని అడగక్కర్లేదు, నేనే చెప్తాను. ఆయన తెలుగులో గొప్ప నవలా రచయిత."

"ఆయన రాసిన నవల పేరేమిటో?"

"ఇప్పుడదంత అవసరమా? ఏ మహానుభావుడు ఏం చెప్పాడో తెలుసుకోటమే ఇంపార్టెంట్ కానీ, ఎవరేం రాశారో గుర్తుంచుకోవాల్సిన అవసరం ఏ మాత్రం లేదు."

"ఆ మాట ఎవరు చెప్పారు?"

"మా బామ్మ చెప్పింది. వెళ్ళి ఆవిడని అడిగిరా."

"ఓర్నీయవ్వ, నేను చావాలనుందా నీకు?"

"మరి నీకెట్లా చెప్పాలి? అందుకే 'తివిరి ఇనుమున తైలంబు తీయ వచ్చు' అన్నాడు ఆ కవి. కానీ నీబోటి బుర్రలేని వాళ్ళను సమఝాయించటం కష్టమన్నాడు."

"'తివిరి ఇసుమున తైలంబు దీయవచ్చు, దవిలి మృగతృష్ణలో నీరు ద్రావ వచ్చు, జేరి మూర్ఖుని మనసు రంజింప రాదు' అని భర్తృహరి అన్నాడని విన్నా" అన్నాను.

"అయుండొచ్చులేవయ్యా! అన్నీ ఎక్కడ గుర్తుంచుకు ఛస్తాం."

"అంతేగానీ పుస్తకాలు చదవవని మాత్రం ఒప్పుకోవు!" అన్నాడు, సుదర్శనం మిత్రుడిని ఎద్దేవా చేస్తూ.

"ఇంగ్లీషు మీడియంలో చదువుకున్న ముండావాణ్ణి! తెలుగంత దౌర్భాగ్యపు భాష లేదని దానికి నా చిన్నప్పుడే విడాకులిచ్చేశాను. ఇంగ్లీషు అట్లాకాదు. నేను ఇంగ్లీషులో చదివిన పుస్తకాల పేర్లు కూడ నీకు తెలియవు!"

"ఒకటి చెప్పు."

అంతలో మా మాటలు వింటున్న కుశాల్రావు. మా దగ్గరకు వచ్చాడు. అతడు కొంత చాదస్తుడు. అతడన్నాడు, "ఆ మాట నిజమేనండీ. తెలుగువాళ్ళల్లో చాలమందికి తెలుగు రాదు. ఆఁ, ఓసారి ఏమయిందంటే....ఇలాంటివాడే, అంటే మన వెంకట్రామయ్యలాంటివాడే, ఒకడున్నాడు. వాడిపేరు శంకర్రావు, తెలుగు పండితుడు. వాడు నేను చక్కగా 'భవంతి', 'ధర' అని చెప్తూంటే, 'అట్లా కాదండీ, అవి సంస్కృతం మాటలు కావు, తెలుగు మాటలు, 'బవంతి', 'దర'అనాలి' అన్నాడు. నాకు తిక్కరేగిందనుకో. 'భవంతి', 'ధర' తెలుగు మాటలంటే ఎవడు నమ్ముతాడు. మన తెలుగు భూమిలో

ఆ సంస్కృతం పదాలు నాటుకోవాలనేగా వాటికి ఆ మేకులు, అంటే వత్తులు, దిగ్గొట్టింది. పిచ్చి వెధవ! తెలుగు పండితుడై ఉండీ అరసున్న మనం వాడటంలేదు కనుక దాన్ని మన లిపిలోనుండి తీసెయ్యాలన్నాడు. అప్పుడు వాడికో రస్సావేశాను. దాంతో వాడికి దిమ్మ తిరిగి పోయింది!"

"అమ్మో మీరు గిరీశంలాంటి వాళ్ళే! ఇంతకీ, ఏఁవిటా రస్సా?" అనడిగాను.

"గ్రామర్‌లో ట్రాన్స్‌లిటరేషన్ అనే పదం ఉంది తెల్సా అని అనడిగాను."

"అంటే ఏంటి? అని అడిగాడు. అప్పుడు ఏం చెప్పానో గుర్తులేదు. దానికేదో తెలుగుమాట ఉండే ఉంటుంది కదా? ఆ మాటే చెప్పి ఉంటాను."

"లిప్యంతరణం అని చెప్పి ఉంటారు. అంటే లిపి మార్చి పరాయి భాషా పదాన్ని రాయటం."

"అదే, అదే! 'మైఁ' అన్న హిందీ మాట తెల్సుగా? అంటే 'నేను' అని అర్థం. దాన్ని తెలుగులో ఎలా రాస్తావో చెప్పు అనడిగాడు. వాడు తలూపి 'మై' అని రాశాడు. 'నీ బొంద! తెలీపోతే తెల్సుకో. ఆ పదంలో 'న'కార ధ్వని ఉంది కదా? దాన్ని రిప్రెజెంట్ చెయ్యకుండానే 'మై' అంటే సరిపోతుందా? కనుక, కనీసం హిందీపదాల్ని తెలుగులో రాయటం కోసమయినా అరసున్న ఉండాల్సిందే' అని వాడిని వాయించాను. 'యాదేఁ', 'దేశ్‌మేఁ' అని రాయాలన్నా అరసున్న అవసరమేగా?దాంతో వాడి తల దిమ్మతిరిగి పోయింది."

"అవసరమేలెండి. అలాగే, తెలుగులో 'మాఁవ', 'రాఁవుడు' పదాల్ని అరసున్నతో పలికి, రాయటంలో మాత్రం 'మామ', 'రాముడు' అని రాస్తున్నాం" అన్నాడు సుదర్శనం.

వెంకట్రామయ్యకు అందులో తర్కం కన్పించింది.

"మా వాడిక్కూడ మీ లాగానే తెలుగు సంగతి బాగానే తెలుసు" అన్నాడు.

"తెలుగు సంగతి వదిలెయ్యవయ్యా? అసలు భాష ఎవరికోసం.ఎదుటివాడి కోసం, మనకోసం కాదు! మన అభిప్రాయాలు ఎదుటివాడు తెల్సుకోటం కోసం. తెలుగువాడు మనమెలా రాసినా అర్థం చేసుకుంటాడు. అసలు మన జాతే మనకోసం కాక ఇతరులకోసం చచ్చే జాతి! మరి హిందీవాడు, ఇంగ్లీషువాడు కూడా మన భాష తెల్సుకోవాలి కనుక మనకు అరసున్న తప్పని సరి!" అన్నాడు కుశాల్రావు.

తన ప్రమేయంలేకుండా సంభాషణ సాగుతూంటే ఉండలేక పోయాడు వెంకట్రామయ్య.

"నేను ఛస్తే ఒప్పుకోను. తెలుగు తెలుగువాళ్ళ కోసమా హిందీవాడు, ఇంగ్లీషువాడి కోసమా? నువ్వు పండితుడివి, నువ్వు చెప్పు, సుదర్శనం!"

ఆ మాట అన్నాక సుదర్శనం కుశాల్రావుతో వాగ్వాదానికి దిగాడు.

"నీ మాటలకు తలాతోకా ఉందా? బరువు తగ్గించుకోవాలని జనం అంటుంటే, నువ్వు పెంచాలని వాదిస్తావు! మన తెలుగు మన కోసమా, పరాయిభాషలవారి వాళ్ళకోసమా? అసలు మనం పరాయి భాషా శబ్దాలనన్నింటినీ పలుకగలమా? అరబ్బీలో 'ఖబర్' అన్న పదాన్ని మనం తెలుగులో రాయగలమా? ఉర్దూలో 'ఖాఫ్' అన్న అక్షరంతో దాన్ని రాస్తారు. దానికి తెలుగు వర్ణమాలలో సంకేతం లేదు. కనుక పలుకలేం. అందుకే తెలుగు ఉచ్చారణకు అనువుగా దాన్ని 'కబురు' చేసుకున్నాం. అలాగే, 'ఖరీద్' అన్న ఫారసీ పదాన్ని 'ఖరీదు' చేసుకున్నాం. హిందీలో రాసుకునేటప్పుడు వాళ్ళకు గత్యంతరం లేదు కనుక 'ఖ' కింద చుక్క పెట్టుకుని అవి పరాయిభాషా పదాలు అని తెలియపర్చుకున్నారు. 'తమిళం' అన్న మాటలో 'ళ' ని అరవ్వాళ్ళు 'జ్' అన్నట్టు పలుకుతారు. దాని ప్రొనన్సియేషన్ తెలుగులో లేదు. కనుక పరాయి భాషలకోసం మన భాష బరువు పెంచాల్సిన పని లేదు."

ఇలా జీవితపు మలి సంధ్యలో ఆహ్లాదంగా, ఆనందంగా పొద్దు పుచ్చుతున్న మాకు మళ్ళీ వెంకట్రామయ్యకు గుండెపోటు వచ్చిందని తెలిసింది, ఇప్పుడు కొంత స్వస్థత చేకూరిందనీ తెలిసింది. మా వాళ్ళందరూ ఆసుపత్రిలో అతన్ని చూసి రావాలని పట్టుబట్టారు. అంతకు ముందు అయిన అనుభవం దృష్ట్యా నేను బెరుకుగానే ఆసుపత్రికి వెళ్ళాను. అందరూ అతని ఆరోగ్యం గురించి విచారిస్తుంటే నేను మౌనంగా వెనకుండి పోయాను.

అంతలో, వెంకట్రామయ్యే, "ఓరి వీడి దుంప తెగ! జగన్నాథం రాలే?" అన్నాడు.

"రాపోవటమేం? వచ్చాడు" అన్నాడు సుదర్శనం.

"ఓర్నీ బండపడ! వెనక తగలడ్డావేం? నేనప్పుడన్న మాట మర్చిపోలేదన్న మాట! మతిమరుపు దేవుడిచ్చిన వరమని ఎవరో అన్నారు" అన్నాడు వెంకట్రామయ్య.

"ఎవరు? ఇంద్రాణీ చటర్జీనా?"

"కాదు. నువ్వే! ఎన్ని తప్పుడు పన్లు చేసి ఉండకపోతే ఆ మాటంటావు?" అన్నాడు వెంకట్రామయ్య గద్దిస్తూ.

"మళ్ళీ వాకింగ్‌కు పార్కుకెప్పుడు వస్తావు?" అడిగాడు కుశాల్రావు.

"వారం రోజుల్లో రానూ? ఈ జీవితంలో బాధలూ, బరువులూ లేకుండా మనం బతికేదక్కడే కదయ్యా?"

"మరీ పిసినారితనం కాకపోతే, జనరల్‌వార్డులో ఎందుకూ, స్పెషల్ రూమ్ తీసుకోక?" అన్నాడు కుశాల్రావు.

"మాట్లాడే జనం లేక ఈ పాటికి టపా కట్టేసేవాడిని! ఇక్కడయితే తోటి రోగులుంటారు, వీలయితే ప్రేమించటానికి నర్సులుంటారు. స్పెషల్ రూమ్‌లో ఏముంది, నా బొంద!" అన్నాడు, తనకు ఇంజెక్షనివ్వటానికొచ్చిన నర్సువంక చూసి చిరునవ్వులు చిందిస్తూ. అందరూ నవ్వారు.

"ఏందీ ముసలి గోల! నీకిప్పుడు ప్రేమ కావల్సివచ్చిందా, తాతా! ఉండు, గట్టిగా ఇస్తానో ముద్దు!" అంటూ, కసుక్కున జబ్బలోకి సూది గుచ్చింది.

"అబ్బ! చంపేశావు కదే! ఏమయినా మమ్మల్ని ముసలివాళ్ళని మాత్రం అనకు."

"అబ్బే, మీరు ముసలివాళ్ళు కాదు, మన్మథ మొలకలు!" అంటూ, గోడమీది మేరీ చేతిలోని బాల యేసు చిత్రం వంక చూసి నవ్వి, "మలి సంధ్యలో విరిసిన మల్లెలు!" అని వెళ్ళిపోయింది నర్సు.

-రచన, ఇంటింటి మాసపత్రిక, అక్టోబరు 2013